ఆ ఇంట్లోకి మూడో వ్యక్తి ఆగమనం అతడికెంతో బావుంది. తనూ, తన తల్లీ వున్నప్పుడు అదో రకమైన నిశ్శబ్దం గూడు కట్టుకుని వుండేది. ఆ ఇంట్లో ఎంత ఆప్యాయతలున్నా వయసు తేడా - ఆ తల్లీ కొడుకుల్ని వేరువేరు అంతస్థుల్లో బిగించింది. కేవలం ఒకే ఒక వ్యక్తి రాకతో ఆ నిశ్శబ్దం పటాపంచలై పోయింది. స్థబ్దతతో జారే పొద్దు ఆ ఇంట్లో హడావుడిని కొత్తగా కొని తెచ్చుకుంది.

రాత్రి చాలా పొద్దుపోయే వరకూ ఈజీఛైర్‌లో కూర్చుని పరమేశ్వరం చదువుకునేవాడు. అతడి పక్కనే స్టూలు మీద పీనల్ కోడ్ నుంచి కేస్ స్టడీస్ వరకూ పెద్ద పెద్ద బౌండు పుస్తకాలు దొంతర్లుగా పేర్చబడి వుండేది. ఆ దృశ్యం ఒకటి విహారికి బాగా నచ్చేది. తమ తమ సబ్జెక్టుల్లో బాగా లోతుగా వెళ్ళిపోయిన వాళ్ళు - ఆ రంగపు వ్యవహారాల్లో లీనమై వున్నప్పుడు ఎంత తాదాత్మ్యం చెందుతారో, బయట ప్రపంచాన్ని ఎంత ఏకాగ్రతతో మర్చిపోతారో అతడు ప్రత్యక్షంగా చూడటం అదే మొదటిసారి. అందుకే తన తండ్రి అంత పెద్ద లాయరయ్యారని అతడు అనుకున్నాడు. అతడికా వూహే ఎంతో గర్వాన్ని కలిగించేది.

మరో రెండు రోజుల్లో పరమేశ్వరం ఢిల్లీ వెళ్ళిపోవాలి. 'నువ్వు నాతో వచ్చెయ్యి అన్నాడు వర్ధనమ్మతో.

"విహారిని ఇక్కడ వంటరిగా వుంచా?"

"వంటరేమిటి? పాతికేళ్ళు దాటుతున్నాయిగా పెళ్ళి చేద్దాం..... ?" అంటూ కొడుకువైపు తిరిగి, "ఏం? నీ దృష్టిలో ఎవరయినా వున్నారా" అని అడిగాడు.

విహారి సిగ్గుపడలేదు. "వచ్చే ద్వాదశి వరకూ ఆగండి నాన్నగారూ" అన్నాడు.

"ఆ రోజు ఏమవుతుంది?" అంది వర్ధనమ్మ ఆశ్చర్యంగా. కొడుకు ఇంత పెద్ద వాడయ్యాడని ఆమెకు తెలీదు.

"చెప్తాగా?"

విహారి వివాహం అయ్యే వరకూ వర్ధనమ్మ అక్కడే వుండేట్టూ, కొత్త కాపురం స్థిరపడ్డాక ఢిల్లీ వెళ్ళేట్టూ ఏర్పాటు జరిగింది.

ఆమె లోపలికి వెళ్లేక పరమేశ్వరం కొడుకువైపు తిరిగి, "ఎవర్రా ఆ అమ్మాయి?" అని అడిగాడు కుతూహలంగా.

తండ్రి ఉత్సుకత చూసి విహారికి నవ్వొచ్చింది. "చెప్తాను నాన్న గారూ! కొంచెం ఓపిక పట్టండి" అన్నాడు.

"ప్రేమ వ్యవహారాల్లో నా అనుభవం నీకేమైనా పనికి వస్తుందేమో చూడు. ఇప్పుడంటే ఇలా వుందిగానీ, ఆ రోజుల్లో మీ అమ్మ చాలా పొగరుగా వుండేది. అందులోనూ కోటీశ్వరుడి ఒక్కగానొక్క కూతురేమో? అసలు కళ్ళెత్తి చూసేదికాదు. అటువంటిదాన్నే నేను ప్రేమలో పడెయ్యగలిగాను. కావాలంటే నీకేమైనా సలహాలిస్తాను. ఫీజు మాత్రం చాలా ఇవ్వాల్సి వస్తుంది సుమా..." నవ్వాడు.

"ఇచ్చుకోలేను నాన్నగారూ! అయినా నా కేసులో అలాంటి గర్వాలూ, అంతస్థులూ ఏమీ లేవులెండి. కేవలం మనస్తత్వ శాస్త్రమే వుంది" నమ్రతగా అన్నాడు విహారి.

"విష్ యు బెస్టాఫ్ లక్ మై సన్."

"థాంక్స్ నాన్నగారూ."

*   *   *

"బంధాలు బాధ్యతలు వెనక్కుతోళాయా పరమేశ్వరం? లేక కొత్తగా వచ్చిన 'గృహం' పాత అనుగ్రహాల్ని మర్చిపోయేలా చేసిందా?"

"లేదు స్వామీ! ఈ పరమేశ్వరం గురుద్రోహం ఎన్నడూ చేయడు. రెండు మూడు రోజులు అక్కడి వాతావరణం పరిశీలించానంతే ఇంకో ఒకటి రెండు రోజుల్లో ఏదో ఒకటి అమలు చేస్తాను."

"చెప్పానుగా. అతడికేమీ కాకూడదు. కానీ జీవితాంతం కుమిలి కుమిలి పోవాలి."

"అదే ఆలోచిస్తున్నాను-"

"ఆలోచనకాదు. ఆచరణ కావాలి ..... పరమేశ్వరం .....! డబ్బున్న అమ్మాయిని వలవేసి ఆస్తి కాజేద్దామనుకున్నావు. చిన్నతనం నుంచి నీ తెలివిని డబ్బు సంపాదన ఎలా? అన్న విషయం మీదే కేంద్రీకరించావు. వివాహం వల్ల అది రాకపోయే సరికి ఆక్సిడెంట్‌లో మరణించినట్టు నటించి భార్యని విధవరాల్ని చేశావు. నీ తెలివిని ముందు గుర్తుంచిన నేను! చెట్టుక్రింద ప్లీడర్‌ని గ్రేటెస్ట్ క్రిమినల్ లాయర్ని చేశాను. కోట్లు కమీషన్ ఇచ్చాను. నీలోని క్రిమినల్ లాయర్ తెలివికన్నా, నీ క్రిమినల్ తెలివే నాకు కావాల్సింది. నన్ను అవమానించిన ఒక మనిషి అసలు ఇన్నిరోజులు యింకా ఆనందంగా వున్నాడంటే అవమానం! వెళ్లు పరమేశ్వరం. రెండ్రోజుల్లోగా సమాధానం కావాలి. మాటల్లోకాదు చేతల్లో ..... "

*   *   *

"ఎవర్రా ఆ ద్వాదశి అమ్మాయి? ప్రవల్లికేనా?" అడిగాడు కొడుకుని.

"కాదు నాన్నగారూ! ఆ అమ్మాయి పేరు సునాదమాల, చాలా భయస్తురాలు."

"ప్రవల్లికతో నీ చనువు చూసి ఆ అమ్మాయిని చేస్కుంటావేమో అనుకున్నాను."

"ఆ అమ్మాయి వివాహం ఎవరో మిలటరీ కల్నల్‌తో నిశ్చయం అయిపోయిందండీ?"

"లేకపోతే చేసుకునేవాడివా?"

మొట్టమొదటిసారి విహారి సిగ్గుపడ్డాడు.

పరమేశ్వరం ఏదో అడగబోతూంటే పద్మాకర్ హడావుడిగా కార్డ్స్ పట్టుకుని వచ్చాడు. మరుసటిరోజే ప్రోగ్రాం 'ఆఖరి పోరాటం' నాటకం. ముఖ్య అతిథి పరమేశ్వరం.

ముందు అతడు ఒప్పుకోలేదు. కానీ స్నేహితులిద్దరూ కలిసి ఒప్పించారు. "మీరు ముఖ్య అతిథిగా వుంటే అది మాకు గర్వకారణమండి" అన్నాడు పద్మాకర్. చివరికి వప్పుకున్నాడు.

పోయాయి " అన్నాడు పద్మాకర్ ఉత్సాహంగా

"ఏమిటి ఈ నాటకం థీమ్?" ఇన్విటేషన్ కార్డు పరిశీలిస్తూ అడిగాడు పరమేశ్వరం.

"కొత్తరకం కథ. ఒక విప్లవకారుడ్ని మంత్రి చంపెయ్యటం-" అన్నాడు పద్మాకర్. "మంత్రి విహారి, విప్లవకారుడు నేను."

"సాహిత్యం వెర్రితలలు వేస్తోందనుకుంటాను."

"లేదు నాన్నగారూ! నిజాన్ని చూపిస్తూంది. దాన్ని భరించలేని భయస్థులూ, అలా వ్రాయలేని రచయితలూ, అది వెర్రితలలు వేస్తుందని ప్రచారం చేస్తున్నారు. మన పక్కనే కూర్చుని మనతో మాట్లాడేవాడే హార్డు కోర్ టెర్రరిస్టు. అయినా దాన్ని మనం గుర్తించలేని స్థితిలో వున్నాం అంత భయంకరంగా వున్నాయి పరిస్థితులు ..... " ఆవేశంగా అన్నాడు విహారి.

పరమేశ్వరం నవ్వి, కొడుకు భుజం తట్టాడు. స్నేహితులిద్దరూ వెళ్ళిపోయారు. అతడు రామ్‌లాల్‌కి ఫోన్ చేశాడు. "రామ్‌లాల్, రేపు ఆడిటోరియంలో నా పక్కసీట్లో మనవాళ్ళు ఎవరన్నా కూర్చునే ఏర్పాటు చెయ్యి."

"అలాగే"

"పరమేశ్వరం ఫోన్ పెట్టేసి మరో అనుచరుడికి ఫోన్ చేశాడు. సనాదమాల వివరాలు చెప్పి, "ఆ అమ్మాయి చేతివ్రాత సంపాదించి, అలాంటి అక్షరాల్తోనే కొన్ని ప్రేమలేఖలు వ్రాసి, పద్మాకర్ ఇంట్లో అతడి గదిలో దొరికే ఏర్పాట్లు చెయ్యి. రేపు రాత్రికి ఇదంతా ఏర్పాటు జరిగిపోవాలి."

అవతలి మనిషి ఇటువంటివి అమలు జరపటంలో ఎక్స్‌పర్టు.

"అలాగే" అన్నాడు వినయంగా.

పరమేశ్వరం లేచి విహారి గదిలోకి వెళ్ళాడు. నాటకం వస్తువులన్నీ ఒక బ్యాగ్‌లో వున్నాయి. అతడి చెయ్యి వాటిని వెతికింది. రెండు నిమిషాల తరువాత దొరికింది.

డమ్మీ పిస్తోలు. నాటకాల్లో ఉపయోగించేది.

*    *        *        *    *

నాటకం రసపట్టులో సాగుతోంది.

రెండు అంకాలు పూర్తయ్యాయి.

పరమేశ్వరానికి ఒక పక్క వర్ధనమ్మ కూర్చొని వుంది. రెండో పక్క ఒక సూటువ్యక్తి ఉన్నాడు.

కథ క్లైమాక్స్‌కి చేరుతోంది.

పరమేశ్వరం సైగచేశాడు. పక్క వ్యక్తి లేచి కర్టెన్ వెనక్కి వెళ్ళాడు. నాటకంలో పాత్రధారులు రంగస్థలం మీదకి తీసుకు వెళ్ళవలసిన వస్తువుల్ని అందుబాటులో పెట్టుకుంటారు. అన్నీ అక్కడే వున్నాయి.

మిగతా పాత్రధారులందరూ జరుగుతున్న నాటకాన్ని తెరల చాటు నుంచి ఉత్సుకతతో

చూస్తున్నారు. సూటు వ్యక్తి నెమ్మదిగా వంగాడు.

డమ్మీపిస్తోలు తీసి, అచ్చంగా అటువంటిదే మరో పిస్తోలు పెట్టాడు.

తరువాత తన స్థానానికి వచ్చి కూర్చున్నాడు.

నాటకం ముగింపు వచ్చింది. పరమేశ్వరం భార్యవేపు వంగి "ఈ సునాదమాల ఎవరో నీకు తెలుసా" అని అడిగాడు.

"లేదండి" అందామె.

"నా ఉద్దేశ్యంలో ఆ అమ్మాయి ఏదో నాటకం ఆడుతోంది. ఆమెకీ, పద్మాకర్‌కీ మధ్య ఏదో గ్రంథం సాగుతోందని నా అనుమానం."

"నిజమా" అంది వర్దని అందోళనతో, "మన అబ్బాయి అంతలా మోసపోతున్నాడా?" వాడిని వెంటనే హెచ్చరించాలి."

"అది ఎలాగూ చేస్తామనుకో. కాని వాడు యిదంతా తెలిసి ఆ అమ్మాయిని కానీ, పద్మాకర్‌ని కానీ ఏదైనా చేస్తే?" పరమేశ్వరం మాటలు పూర్తికాలేదు.

"ఢాం" అని పిస్తోలు పేలింది స్టేజిమీద.

మంత్రి వేషంలో వున్న విహారి వికటాట్టహాసంతో తెరపడింది.

ఆడిటోరియంలో చప్పట్లు.

పరమేశ్వరం భార్యతో లేచి స్టేజి మీదకు వెళ్ళాడు. అక్కడ పరిస్థితి బయటి దానికి వ్యతిరేకంగా వుంది. పద్మాకర్ రక్తపు మడుగులో వున్నాడు. ఒక బుల్లెట్ మెదడులోంచి, మరొకటి గుండెల్లోంచి వెళ్ళి పోయి వుంది. ప్రాణంపోయి ఎంత సేపయిందో తెలీదు. విహారి శిలా ప్రతిమలా నిలబడివున్నాడు. చేతిలో పిస్టల్ ఇంకా అలాగే వుంది.

వర్దనమ్మ కెవ్వున అరిచి ముందుకు పరుగెత్తింది.

పరమేశ్వరం వెళ్ళలేదు. చిన్న స్వరంతో అన్నాడు. ఒకే అమ్మాయిని ఇద్దరు ప్రేమించారు. - స్టేజిమీద నాటకం ఆడినట్టు నటించి స్నేహితుడిని మర్డర్ చేసిన కోల్డ్ బ్లడెడ్ హంతకుడు విహారి! మాల ప్రేమలేఖలు పద్మాకర్ గదిలో దొరుకుతాయి!! పధ్నాలుగు సంవత్సరాలకు తక్కువకాకుండా విహారికి శిక్షపడుతుంది. వెళ్ళు. వెళ్ళి స్వామికి చెప్పు. పరమేశ్వరం చెప్పినమాట నిలబెట్టుకున్నాడని - స్వంత కొడుకు యవ్వనకాలాన్ని జైలుగోడలమధ్య సమాధి చేశాడనీ చెప్పు."

పక్క వ్యక్తి అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

పరమేశ్వరం కోడుక్కు దగ్గరగా వెళ్ళారు. "విహారీ! ఏమిట్రా ఇది" అన్నాడు అందోళనగా.

షాక్‌నుంచి విహారి అప్పుడే స్పృహలోకి వచ్చినట్టు "నాన్నగారూ" అన్నాడు.

"ఎంతపని చేశావు విహారీ!"

విహారి చేతిలోంచి పిస్తోలు జారిపడింది.

వర్దని ఏడుస్తోంది. "ఏమండీ! బాబుకి ఏమవుతుందండీ?"

పరమేశ్వరం జవాబు చెప్పలేదు. దేశంలోని ఏ లాయరూ యిక విహారిని రక్షించలేడని అతనికి తెలుసు.

అతడు భార్య దగ్గరికి వెళ్ళాడు. ఏ క్షణాన్నైనా స్పృహ తప్పేట్లు వుందామె. పొదివి పట్టుకుని "ఊరుకో వర్దనీ" అన్నాడు.

పక్కనున్న మరో నటుడు "తొందరగా అంబులెన్సుకి ఫోన్ చెయ్యండి-" అని అరుస్తున్నాడు.

"అనవసరం. ప్రాణం పోయింది" అంటూన్నారు మరెవరో.

పరమేశ్వరం పిస్టల్ వేపు చూశాడు. జేబులోంచి కర్చీఫ్ తీసి దాన్ని అందుకున్నాడు. పిస్టల్ అందుకుంటూ వుండగా పక్కనుంచి ఎవరో అన్నారు - "ఎందుకు అలా చేస్తున్నారు?".

పరమేశ్వరం సమాధానం చెప్పకముందే - "న్యాయం దృష్టిలో అందరూ ఒక్కటే. కొడుకయినా సరే ఉరికంబం ఎక్కాల్సిందే - అని అయన ఉద్దేశ్యం కాబోలు " అన్న స్త్రీ కంఠం వినపడింది.

పక్కనుంచి వినపడిన మాటలకి పరమేశ్వరం అదిరిపడి అటు చూశాడు. ఎప్పుడొచ్చిందో తెలీదు. ప్రవల్లిక అక్కడ వుంది! అతడి మొహంలో భావాలు మారాయి. ఆమె నవ్వింది.

ఈలోపులో పరమేశ్వరం సర్దుకున్నాడు. "అవును కొడుకైనా సరే - చేసిన దానికి శిక్ష అనుభవించాల్సిందే" అన్నాడు కటువుగా.

"అందులోనూ ఇది కోల్డ్ - బ్లడెడ్ మర్డరాయె. వెయ్యిమంది ప్రేక్షకుల ముందు నిర్దాక్షిణ్యంగా చంపటం -" అంది ప్రవల్లిక.

ఆప్పుడొచ్చింది అతడికి ఏదో అనుమానం! సంధిగ్ధంగా ప్రవల్లిక వైపు చుశాడు. ఆమె పెదవుల మీద లీలగా కదుల్తున్నట్టుంది నవ్వు. అనుమానం స్థిరపడి, పద్మాకర్‌వేపు తిరిగాడు. నేలమీద పడివున్న పద్మాకర్ అప్పుడే లేచి కూర్చుంటున్నాడు. అప్పటి వరకూ సీరియస్‌గా భయం నటిస్తూన్న విహారి కూడా నవ్వటం మొదలుపెట్టాడు. మిగతా నటులందరూ కూడా అప్పటి వరకూ జరిగిన సీన్‌ని తమ అవధుల మేరకు నటించినట్టు నవ్వుకుంటున్నారు.

వర్దనమ్మకు మాత్రం చాలా కోపం వచ్చింది. "ఏమిట్రా ఇదంతా?" అని కొడుకుని తిట్టింది.

పద్మాకర్ కల్పించుకుని "స్టేజీమీదే కాదు. తెరపడ్డాక కూడా ఎంతసేపు నటించగలను అని ప్రవల్లిక గారితో పందెం వేసానాంటీ! అంటూ నవ్వేడు."

"ఏడిశావు. కొద్దిగా వుంటే నాగుండె ఆగిపోయి వుండేది" అంది వర్దనమ్మ. ఈ లోపు ప్రవల్లిక కల్పించుకోని "చిన్న చిన్న విషయాలకే ఆగిపోయే గుండె రాబోయే పెద్ద పెద్ద షాకులకు ఎలా తట్టుకోగలదా అని చిన్న ప్రయోగం చేసి వుంటారు. అంతేనా పరమేశ్వరంగారూ?" అంది.